ధరాఘాతం

ఇరకాటంలో ఇంటి బడ్జెట్ • సబ్బులు, హెయిర్ ఆయిల్స్ ప్రియం

2 నుంచి 11 శాతం పెరిగిన రేట్లు • సామాన్యుల నెత్తిన భారం

ఆయా ఆహారోత్పత్తుల ధరలూ 17 శాతందాకా పైకి

ధరలు పెరుగుతున్నాయి. ఇంటి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

సబ్బులు, సర్ఫ్ పొడర్ల దగ్గర్నుంచి తలంటుకునే నూనెలు, పొద్దున్నే చకచకా చేసుకుతినే నూడుల్స్‌దాకా ప్రియమైపోయాయి.

ఎఫ్ఎంసీజీ కంపెనీలు ఆహార, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తుల రేట్లను పెంచడంతో గత 2-3 నెలలుగా నెలవారీ షాపింగ్ బిల్లులు మోత మోగిస్తున్నాయి మరి.

న్యూఢిల్లీ, జూన్ 18: ధరల మంట మొదలైంది. సామాన్యుల ఇంటి బడ్జెట్ తలకిందులవుతున్నది. సబ్బులు, హెయిర్ ఆయిల్స్, ఆహారోత్పత్తులు అన్నింటి రేట్లనూ ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీలు పెంచుకుంటూపోతున్నాయి మరి. గడిచిన 2-3 నెలల్లో 2 నుంచి 17 శాతం వరకు పెరిగిన ధరలతో బిల్లులు మోత మోగిస్తున్నాయి. గత కొంత కాలంగా మౌనంగా ఉన్న సంస్థలు.. ఇప్పుడు మళ్లీ బాదుడు మొదలుపెట్టాయి. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్నికలు ముగిసిన వేళ.. ఎఫ్ఎంసీజీల రేట్ల పెంపు ప్రస్తుతం సర్వత్రా ఆసక్తిదాయకంగా మారుతున్నది.

ఇదీ సంగతి..

సబ్బులు, బాడీ వాష్‌ల ధరలు 2 నుంచి 9 శాతం పెరిగినట్టు తాజా లెక్కలు చూస్తే అర్థమవుతున్నది. హెయిర్ ఆయిల్స్ ధర 8 నుంచి 11 శాతం ఎగబాకగా, వివిధ రకాల ఆహారోత్పత్తుల ధరలు 3 నుంచి 17 శాతం ఎగిసినట్టు తేలింది. నిజానికి 2022, 2023 ప్రథమార్ధం వరకు ధరల్ని పెంచుతూపోయిన ఎఫ్ఎంసీజీ సంస్థలు.. ఆ తర్వాత సైలెంటైపోయాయి. ముఖ్యంగా క్రూడ్, పామాయిల్ ధరలు మార్కెట్‌లో తగ్గుముఖం పడుతున్న వేళ సబ్బుల ధరలు పెరగడం గమనార్హం. ఇక పాలు, చక్కెర, కాఫీ, కొబ్బరి, బార్లీ వంటి వాటి ధరలు కూడా విజృంభిస్తున్నాయి.

ఇంకా పెరగొచ్చు

ఆయా ఉత్పత్తుల ధరలు ఇప్పటికే పెరిగాయని, మున్ముందు ఇంకా పెరుగుతాయని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవలి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎఫ్ఎంసీజీ దిగ్గజం మారికో.. ఏప్రిల్‌లో హెయిర్ ఆయిల్ ధరలను 6 శాతం పెంచామని, కొబ్బరి రేట్లు పెరుగుతున్నందున మళ్లీ పెరిగేందుకు వీలున్నదని సంకేతాలిచ్చింది. టాటా కన్జ్యూమర్ సైతం ఇదే దారిలో వెళ్తున్నది. డాబర్, ఇమామీ రేట్లు కొంతమేర పెరుగుతాయంటున్నాయి. మరోవైపు కూరగాయల ధరలు దారెత్తిస్తున్నాయి. కిలో టమాట సెంచరీ దిశగా పరుగు పెడుతుంటే, ఉల్లి హాఫ్ సెంచరీ కొట్టింది. పచ్చి మిర్చి రూ.80 పలుకుతున్నది. బెండ, దొండ ధరలూ పైపైకిపోతున్నాయి. అన్ని రకాల పప్పుల ధరలూ కిలో రూ.120 నుంచి 180 మేర పలుకుతున్నాయి.

- *వివిధ రకాల సబ్బుల ధరల్ని 4-5 శాతం పెంచిన గోద్రెజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్. డవ్ సోప్ ధరను 2 శాతం పెంచిన హిందుస్థాన్ యునిలీవర్ లిమిటెడ్. సంతూర్ సబ్బు ధరను 3 శాతం పెంచిన విప్రో.*
- *పెరిగిన కాల్గేట్ పామోలివ్ బాడీ వాష్ ధరలు. 4 శాతం పెరిగిన పియర్స్ బాడీ వాష్ రేటు.*
- *హెచ్‌యూఎల్ డిటర్జంట్ బ్రాండ్లు, పీఅండ్‌జీ హైజిన్-హెల్త్‌కేర్, జ్యోతీ ల్యాబ్స్ ఉత్పత్తుల రేట్లు 1 నుంచి 10 శాతం పుంజుకున్నాయి.*
- *హెచ్‌యూఎల్‌కు చెందిన షాంపూ ధరలు, స్కిన్ కేర్ ఉత్పత్తుల రేట్లు 4 శాతం వరకు ఎగిశాయి.*
- *8-13 శాతం పెరిగిన నెస్లే కాఫీ ధర. మ్యాగీ ఓట్స్ నూడుల్స్ ధర 17 శాతం ఎగిసింది. ఐటీసీ ఆశీర్వాద్ గోధుమ ధరలూ పైకెక్కాయి.*

నేర్చుకోలేకపోతున్నారు..

పెరుగుతున్న 'లౌడ్ లెర్నింగ్' • లింక్డ్ఇన్ తాజా సర్వే

పని, కుటుంబ ఒత్తిళ్లతో నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్న ఉద్యోగులు

న్యూఢిల్లీ, జూన్ 18: నేర్చుకోవడానికి వీలుగా మా సంస్థలు అన్ని అవకాశాలు కల్పిస్తున్నా వాటిని అందిపుచ్చుకోలేకపోతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. పని ఒత్తిళ్లు, కుటుంబ బాధ్యతల వల్లే నైపుణ్యాభివృద్ధిలో వెనుకబడుతున్నట్టు మెజారిటీ ఎంప్లాయిస్ చెప్తున్నారు. అవును.. దేశంలోని ప్రతీ 10 మంది ఉద్యోగ నిపుణుల్లో 9 మందిది ఇప్పుడిదే మాట అంటున్నది ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్క్ లింక్డ్ఇన్ తాజా నివేదిక ఒకటి. మార్కెట్‌లో వస్తున్న మార్పులకు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ ఉద్యోగులకు తర్ఫీదునిస్తూపోతున్నాయి చాలా కంపెనీలు. అయితే ఆఫీస్‌లో పని భారం, వ్యక్తిగత లేదా కుటుంబ బాధ్యతలతో సతమతమైపోతూ శిక్షణపై అత్యధిక ఉద్యోగులు దృష్టి సారించలేకపోతున్నారు. 91 శాతం ఉద్యోగులది ఇదే పరిస్థితి అని లింక్డ్ఇన్ తాజా అధ్యయనంలో తేలింది.

లౌడ్ లెర్నింగ్

పని ఒత్తిడి, వ్యక్తిగత కారణాలతో కంపెనీలు ఇస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్‌పై ఆసక్తి చూపలేకపోతున్న ఉద్యోగులు.. తమకున్న అడ్డంకులను అధిగమించడానికి 'లౌడ్ లెర్నింగ్' మంత్రాన్ని జపిస్తున్నారు. ఆఫీసులు లేదా పనిచేసే చోట నేర్చుకోవాలన్న లక్ష్యాలపై తమకున్న ఆసక్తిని ఉద్దేశపూర్వకంగా గట్టిగా వ్యక్తపరిచే చర్యనే ఈ 'లౌడ్ లెర్నింగ్' అంటారు. ఇది తమ కెరియర్ వృద్ధికి దోహదపడగలదని ఏకంగా 79 శాతం మంది ఉద్యోగులు విశ్వసిస్తుండటం గమనార్హం. ఇక లింక్డ్ఇన్ సైతం ఉద్యోగ నిపుణుల కోసం కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత అత్యుత్తమ సాధనాలను అందుబాటులోకి తెచ్చింది. కాగా, అనుభవజ్ఞులైన నిపుణుల నుంచి మెంటార్‌షిప్, గైడెన్స్ అవసరమని, కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా శిక్షణ కావాలని, మారుతున్న టెక్నాలజీ, పరిస్థితులపై అవగాహనను పెంచుకోవడం తప్పనిసరి అని ఈ అధ్యయనంలో పాల్గొన్న ఎక్కువమంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం చాలా కంపెనీలు ఏఐ ఆధారిత సేవలు, ఉత్పాదకతపై దృష్టి పెడుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున ఉద్యోగ కోతలూ జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా సర్వే ప్రాధాన్యతను సంతరించుకున్నది.

దేశంలో ఉద్యోగాల కోసం ఇప్పుడు అవసరమైన నైపుణ్యాల్లో 2030 నాటికి 64 శాతం మారిపోవచ్చు. అందుకే ఉద్యోగులు ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని ఆహ్వానిస్తూపోవాలి. నయా టెక్నాలజీలు, నూతన అంశాలపై దృష్టి సారించి వాటిలో ఆరితేరాలి. అప్పడే కొలువులు భద్రంగా ఉంటాయి.

-నిరాజితా బెనర్జీ, లింక్డ్ఇన్ కెరియర్ ఎక్స్‌పర్ట్

ఎల్ అండ్ టీకి భారీ ఆర్డర్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ఎల్అండ్‌టీకి హైదరాబాద్, ముంబైల నుంచి భారీ ఆర్డర్లు లభించాయి. బిల్డింగ్స్ అండ్ ఫ్యాక్టరీస్ (బీఅండ్ఎఫ్) విభాగం నుంచి ఇవి వచ్చాయని సంస్థ వెల్లడించింది. ఆర్డర్ విలువ సంస్థ వెల్లడించకపోయినప్పటికీ ప్రాజెక్ట్ విలువ ఆధారంగా రూ.1,000 కోట్ల నుంచి రూ.2,500 కోట్ల మధ్యలో ఉంటుందని అంచనా.

'ఇప్పట్లో వడ్డీరేట్లు తగ్గవు'

ముంబై, జూన్ 18: ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు లేవని, సమయం వచ్చినప్పుడు రేట్లపై నిర్ణయం తీసుకుంటామని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టంచేశారు. ఈటీ నౌస్ లీడర్‌షిప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పరపతి సమీక్షను అత్యవసరంగా మార్చాల్సిన అవసరం లేదని, ద్రవ్యోల్బణం దిగొచ్చాక, మిగతా పరిణామాలను కూడా బేరీజు వేసుకున్న తర్వాతనే రేట్ల తగ్గింపుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. మరోవైపు ఫ్యూచర్, ఆప్షన్ ట్రేడింగ్ మార్కెట్లలో అధిక ట్రేడింగ్ గణాంకాలపై సెబీతో కలిసి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. అలాగే మార్చి త్రైమాసికపు కరెంట్ ఖాతా లోటును వచ్చేవారంలో విడుదల చేస్తామన్నారు.

న్యూయార్క్ స్థాయిలో హైదరాబాద్ వృద్ధి

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): అమెరికాలో స్థిరపడిన రాష్ట్ర ప్రజలు న్యూయార్క్‌తో పోల్చుకునేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉన్నదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ భౌ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎంతో భేటీ అయ్యింది. హైదరాబాద్ గ్లోబల్ సిటీగా వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాలు విస్తరిస్తున్న తీరుపై వారు చర్చించారు. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు రూట్ విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారుకానున్నదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, హైదరాబాద్‌ను ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలనేది తమ సంకల్పమన్నారు. ఈ సందర్భంగా మ్యాథ్యూ భౌ మాట్లాడుతూ.. దేశంలోనే హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నదని, గత ఆరు నెలల్లో రియల్టీతోపాటు ఆఫీస్ స్థలాల లీజు, నిర్మాణం, రెసిడెన్షియల్ స్పేస్‌లోనూ గణనీయమైన వృద్ధి నమోదు చేసిందన్నారు. మరోవైపు, మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో లాక్ హీడ్ మార్టిన్ కంపెనీ హెడ్ మిస్టర్ ఫర్నాండేజ్ భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ పరిశోధన సెంటర్

హైదరాబాద్, జూన్ 18: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థయైన ఎన్ఎండీసీ.. తాజాగా హైదరాబాద్‌లో పరిశోధన-అభివృద్ధి కేంద్రాన్ని(ఆర్అండ్‌డీ సెంటర్) ప్రారంభించింది. ఖనిజ ఉత్పత్తి, ప్రాసెసింగ్, స్థిరమైన ఉక్కు సాంకేతికలో ఆవిష్కరణలే లక్ష్యంగా పటాన్‌చెరు వద్ద ఎనిమిది ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన సెంటర్ కోసం రూ.50 కోట్ల నిధులు వెచ్చించినట్లు కంపెనీ సీఎండీ(అదనపు) అమితావ ముఖర్జీ తెలిపారు. స్థిరమైన వృద్ధిని నమోదు చేసుకుంటున్న దేశీయ గనుల రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లు

77 వేల పైకి సెన్సెక్స్ • 308 పాయింట్లు పుంజుకున్న సూచీ

ముంబై, జూన్ 18: దేశీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. బెంచ్‌మార్క్ ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ తొలిసారిగా 77 వేల మార్క్‌ను అధిగమించగా, నిఫ్టీ సైతం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు కిక్కునిచ్చాయి. 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 308.37 పాయింట్లు అందుకొని నూతన గరిష్ఠ స్థాయి 77,301.14 వద్ద ముగిసింది. ఇంట్రాలో 374 పాయింట్లు ఎగబాకి లైఫ్‌టైం హై 77,367 తాకి చివర్లో ఈ లాభాలను నిలుపుకోలేకపోయింది. మరో సూచీ నిఫ్టీ 92.30 పాయింట్లు ఎగబాకి రికార్డు స్థాయి 23,557.90 వద్ద స్థిరపడింది. దీంతో బీఎస్ఈలో లిస్టైన సంస్థల విలువ రికార్డు స్థాయి రూ.4,37,24,261.40 కోట్లు(5.24 ట్రిలియన్ డాలర్లకు) చేరుకున్నది. గత నాలుగు సెషన్లలో మదుపరుల సంపద రూ.10.29 లక్షల కోట్ల మేర పెరిగింది. సూచీల్లో పవర్ గ్రిడ్, విప్రో, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎస్బీఐ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. కానీ, మారుతి, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, టాటా మోటర్స్, ఐటీసీ, టీసీఎస్‌లు నష్టపోయాయి.

మహీంద్రా వరి నాటే యంత్రం



హైదరాబాద్, జూన్ 18: మహీంద్రా అండ్ మహీంద్రా.. వ్యవసాయ ఉత్పత్తుల విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తెలుగు రాష్ర్టాల్లో ఆరు వరుసల వరి నాటే 6ఆర్‌వో యంత్రాన్ని ఆవిష్కరించింది. వరిసాగు సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు అత్యంత శక్తివంతమైన, సమర్థవంతమైన ఇంజిన్, అధునాతన టెక్నాలజీతో దీనిని రూపొందించింది. మహీంద్రా ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి 75 శాతం వరకు ఫైనాన్స్ లభించనున్నది.

జోరుగా పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ, జూన్ 18: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4,62,664 కోట్ల ప్రత్యక్ష పన్నులు వసూలైనట్లు ఐటీ శాఖ వెల్లడించింది. ఈ నెల 15 నాటికి తొలి విడత అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 27.34 శాతం ఎగబాకి రూ.1.48 లక్షల కోట్లకు పెరగడం కలిసొచ్చింది.

పోలీసుల పని తీరు అభినందనీయం

• ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ ప్రశంస

నిర్మల్ అర్బన్, జూన్ 18 : సమన్వయంతో పని చేసి పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకంగా నిలిచిన పోలీస్ అధికారులు, సిబ్బంది పని తీరు అభినందనీయమని రాష్ట్ర ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ జిల్లా పోలీసులను ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ..జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో శ్రమించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ ఎన్నికల్లో పోలీసులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయంగా పని చేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభతరమైందని తెలిపారు. అందరి కృషితోనే ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు చెప్పారు.

నాలుగో తరగతి ఉద్యోగులను బదిలీ చేయాలి

• సంఘం జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్

ఇచ్చోడ, జూన్ 18 : ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ, ఆశ్రమ, వసతి గృహాల్లో పని చేస్తున్న కుక్, వాచ్‌మెన్, అటెండర్లకు 8 సంవత్సరాల నుంచి బదిలీలు లేక ఇబ్బంది పడుతున్నారని, వెంటనే చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షౌకత్ హుస్సేన్ అన్నారు. మంగళవారం ఇచ్చోడ మండలంలోని మేడిగూడ ఏహెచ్ఎస్ బాలికల పాఠశాలలో నాలుగో తరగతి ఉద్యోగులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు ఆరోగ్యం బాగా లేక, కుటుంబ సమస్యలుండడంతో 371 జీవో ప్రకారం వివిధ జిల్లాలకు బదిలీలు చేసినందున వారు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సరిగ్గా విధులకు హాజరు కాలేకపోతున్నారన్నారు. తక్షణమే ఉద్యోగులకు బదిలీలు చేయాలని కోరారు. డెలివెజ్స్, ఏఎన్ఎం, పార్ట్ టైం, రానిటెన్స్ వర్కర్లకు వేతనాల బడ్జెట్ విడుదల చేయాలని, ప్రిన్సిపల్ సెక్రటరి, ట్రైబల్ వెల్ఫేర్ హైదరాబాద్‌కి బడ్జెట్ మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిడాం శ్రీనివాస్, జిల్లా గౌరవాధ్యక్షుడు కేబీసీ నారాయణ, ఉద్యోగులు మాన్కు, కే కమల, హీరమ్మ, టీ.రంభ, మారుతి, వీ.సునీత, పుష్పబాయి, చిత్రు, కే అశోక్, సోనేరావ్, పీ జంగు, నితిన్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి

సోన్, జూన్ 18 : నిర్మల్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31వరకు ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులను వివరించారు. ఈ కార్యక్రమానికి డీఆర్డీవో పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆడిట్ చేసిన వాటిలో డబ్బులు కాజేస్తున్నారని, కూలీలు పనికి రాకున్నా డబ్బులు వేస్తున్నారని అటువంటివి ఏమీ లేవని, ఉపాధి కూలీలు ఎక్కువగా ఉన్నప్పుడు మస్టర్‌ను చెక్ చేసుకోకపోవడం వల్ల కొన్ని చిన్న చిన్న తప్పులు ఉన్నాయని ఇలాంటివి వచ్చే సంవత్సరం రాకుండా చూసుకోవాలన్నారు. మాస్టర్‌లో ఉపాధి కూలీల సంతకాలను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ సుధాకర్, ఎంపీడీవోలు గజానంద్, సాయిరాం, ఏపీవో తుల రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులున్నారు.

'ఫీజు'లుం..

• ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

• నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు

దుకాణంలో పుస్తకాలు విక్రయిస్తున్న ఓ ప్రైవేట్ పాఠశాల సిబ్బంది

భైంసా, జూన్, 18 : ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఫీజులు పెంచుతూ విద్యార్థుల తల్లిదండ్రులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నాయి. నియంత్రించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో భైంసాలో వారు ఆడిందే పాట.. పాడిందే పాటగా మారింది.

భైంసాలో 30 ప్రైవేట్ బడులు

అధికారిక లెక్కల ప్రకారం పట్టణంలో 30 ప్రైవేట్ పాఠశాలలున్నాయి. వీటిలో సుమారు 25 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలలో నర్సరీకి ఫీజు రూ. 19 వేలు, అడ్మిషన్ ఫీజు రూ. 5 వేలు, పుస్తకాలకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎల్‌కేజీకి రూ. 28 వేలు, యూకేజీకి రూ. 29 వేల పైన, 6వ తరగతికి రూ. 30వేల పైన, 7వ తరగతికి రూ. 40 వేలు, పదవ తరగతికి సుమారు రూ.60 వేల వరకు తీసుకుంటున్నారు. అదే పాఠశాలలో హాస్టల్‌లో ఉంటే ఏడాదికి రూ. 40 వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

అమలు కాని విద్యా హక్కు చట్టం

విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో అడ్మిషన్ ఫీజు వసూలు చేయవద్దు. కాని పట్టణంలోని పలు పాఠశాలల్లో రూ. 1000 నుంచి మొదలు కొని రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నారు. ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం పేద పిల్లలకు ఉచితంగా విద్య అందించాలనే నిబంధన ఉంది. దానిని అమలు చేసిన దాఖలాలు లేవు. 2020లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయినా అమలుకు నోచుకోవడం లేదు. యూనిఫామ్స్, పుస్తకాలు, షూలు ఎట్టి పరిస్థితుల్లో పాఠశాలల నిర్వాహకులు విక్రయించవద్దనే నిబంధన ఉంది. అయినా ఇవేమీ పట్టించుకోవడం లేదు. ఏకంగా పాఠశాల సిబ్బందే దుకాణాల్లో పుస్తకాలు పెట్టుకొని ఇష్టారాజ్యంగా విక్రయిస్తున్నారు. విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని ఇటీవల పలు సంఘాల నాయకులు ఎంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు గమనించి అన్ని వర్గాల పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇచ్చే విధంగా చూడాలన్నారు.

ప్రజలకు సేవలందించడంలో ముందున్నాం

• ఉత్తమ సిబ్బందిని ఆదర్శంగా తీసుకోవాలి • ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్

ఉత్తమ డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బందిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం, డీఎంలు

ఎదులాపురం, జూన్18: ప్రజలకు సేవలందించడంలో ఆర్టీసీ ముందు ఉందని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ అన్నారు. ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల్లో భాగంగా మంగళవారం ఆర్టీసీ డిపోలో ఉమ్మడి ఆదిలాబాద్‌లోని 6 డిపోలో 28 మంది ఉత్తమ ప్రతిభ కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సిబ్బందికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలతో పాటు శాలువాతో సత్కరించారు. ఉత్తమ సిబ్బంది, ఉద్యోగులను తోటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రశంసా పత్రం, బహుమతి తీసుకున్న ఉద్యోగులకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు ఎస్.ప్రణీత్, ఎం.ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్లు కల్పన, ప్రతిమారెడ్డి, విశ్వనాథ్,రవీంద్రనాథ్, పర్సనల్ ఆఫీసర్ ఖిబ్లా, ఆర్ఎం ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ కిరణ్, ఆదిలాబాద్ ఎంఎఫ్ శ్రీకర్ తదితరులు ఉన్నారు.

11 మంది టీచర్లకు ఎస్ఏలుగా ఉద్యోగోన్నతి

బోథ్, జూన్ 18 : మండలంలోని ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న 11 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి లభించింది. అప్పల శ్రీనివాస్ రెడ్డి (ఎస్ఏ, కౌఠ(బీ) జడ్పీఎస్ఎస్), ఎస్.సుదర్శన్ గౌడ్ (ఎస్ఏ, తెలుగు, కౌఠ(బీ) జడ్పీఎస్ఎస్, జీ.వెంకటరమణ (ఎస్ఏ తెలుగు, కన్నుగట్ట జడ్పీఎస్ఎస్), ఆర్.మధుసూదన్ (ఎస్ఏ సోషల్ జడ్పీఎస్ఎస్ సోనాల), రమేశ్ చందర్ (ఎస్ఏ ఫిజికల్ సైన్స్ జడ్పీఎస్ఎస్ సోనాల), విజయ్ కుమార్ (ఎస్ఏ సోషల్, జడ్పీఎస్ఎస్ మర్లపెల్లి), ఈ.రాజేశ్వర్ (ఎస్ఏ బయోసైన్స్, జడ్పీఎస్ఎస్ కన్నుగట్ట), డీ.గంగారాం (పీఎస్ హెచ్ఎం కౌఠ), ఎస్.ఈశ్వర్ (పీఎస్ హెచ్ఎం పొచ్చెర), దశరథ్ (పీఎస్ హెచ్ఎం బంజారాతండా), అజ్గార్ ఉన్నిసా బేగం (పీఎస్ హెచ్ఎం మర్లపెల్లి) ఉద్యోగోన్నతి లభించింది.

నేడు సికిల్‌సెల్‌పై అవగాహన దినోత్సవం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఎదులాపురం, జూన్ 18 : జాతీయ సికిల్ సెల్ అనీమియా ఎలిమినేషన్ మిషన్‌ను ప్రధాన మంత్రి 1 జూలై 2023న ప్రారంభించారు. ప్రపంచ సికిల్ సెల్ అవగాహన దినోత్సవాన్ని బుధవారం రిమ్స్ దవాఖాన ఆడిటోరియంలో నిర్వహించేందుకు వైద్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ పర్యవేక్షించారు. రాష్ట్రంలో 14 జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, మలేరియా, ఫైలేరియా ప్రాంతీయ సంచాలకుడు అమర్‌సింగ్ హాజరుకానున్నారని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై పాదయాత్ర

మొక్కలు పంపిణీచేస్తున్న యోగానంద సరస్వతి, హర్ష్‌పండిత్

ఎదులాపురం,జూన్ 18: పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేలా తన వంతుగా వెయ్యి రోజుల పాదయాత్ర చేపట్టినట్లు హర్యానా రాష్ట్రానికి చెందిన హర్ష్ పండిత్ అన్నారు. ఆగస్టు 21న రాజస్థాన్ నుంచి చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఆదిలాబాద్‌కు చెరుకున్నది. స్థానిక యువకులు ఆయనకు స్వాగతం పలికారు. స్థానిక గోపాలకృష్ణమఠం ఎదుట పీఠాధిపతి యోగనంద సరస్వతితో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హర్ష్ పండిత్ మాట్లాడుతూ..మానవాళికి మేలు చేసే చెట్లను నరికివేస్తున్నామని, దీంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతిని సమయానికి వర్షాలు రావడం లేదన్నారు. పర్యావరణంతో పాటు హైందవ సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేసేందుకే యాత్ర చేపట్టినట్లు గుర్తు చేశారు.

కేంద్రం నిధులతో అభివృద్ధి చేస్తా

• ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్

బజార్‌హత్నూర్‌లో ఎంపీ గోడం నగేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బజార్‌హత్నూర్, జూన్ 18 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారంతో నిధులు తీసుకువచ్చి బోథ్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో మండల బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ సభను నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, యువకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, మండల కన్వీనర్ పోరెడ్డి శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకన్న ప్రశాంత్, నాయకులు కొత్త శంకర్, అల్కె గణేశ్, సుఖ్‌దేవ్, నానం రమణ, బొడ్డు భోజన్న, వినాయక్, నందు, రాములు, కేవల్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ డబ్బులు జమ

ఎదులాపురం, జూన్ 18: దేశ వ్యాప్తంగా పీఎం కిసాన్ ద్వారా 17వ విడుత పెట్టుబడి సాయం కింద నగదు జమచేస్తున్నారని ఆదిలాబాద్ ఎంపీ గెడం నగేశ్ తెలిపారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధానమంత్రి పెట్టుబడి సాయం కింద జమ చేసే కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా రైతులకు చూపించినట్లు తెలిపారు.

ఆమరణ నిరాహార దీక్షకు సంఘీభావం

ఉట్నూర్, జూన్ 18 : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మంగళవారం బ్రహ్మశ్రీ కొండోజు నర్సింహాచారి తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్షకు మద్దతుగా ఉట్నూర్ స్వర్ణకార సంఘం సభ్యులు సంఘీభావంగా షాపులు బంద్ చేశారు. కార్యక్రమంలో కట్ట ప్రభాకర్ చారి, సంతోష్‌చారి, సాయికృష్ణాచారి, ఆగయ్య, జగదీశ్వరా చారి, లక్ష్మణాచారి, ప్రసాద్, సత్యం, వైష్ణవ్ పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో ఉద్రిక్తత

లక్ష్మణచాంద, జూన్ 18 : చేనులో పనిచేస్తున్న యువతులను ఓ వర్గానికి చెందిన యువకులు వేధించడం ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. అడ్డుగా వచ్చిన యువకులపై దాడి చేయడం.. విషయం తెలిసి గ్రామస్తులు ఆందోళన చేయడంతో ఏకంగా పోలీసులు రంగంలోకి దిగాల్సి వచ్చింది. చివరకు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. బాధితుల కథనం ప్రకారం.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాందకు చెందిన ఓ వర్గానికి చెందిన నలుగురు పోకిరీ యువకులు గంజాయి, మద్యం మత్తులో మంగళవారం హల్‌చల్ చేశారు. సమీపంలోనే ఉన్న మామడ మండలం అనంతపేట్ శివారుకు రెండు బైక్‌లపై వెళ్లారు. రోడ్డు పక్కన పంట చేనులో పని చేస్తున్న ఇద్దరు యువతులను వేధించారు. గమనించిన అదే గ్రామానికి చెందిన యువకులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, అడ్డొచ్చిన వారిపై దాడి చేశారు. ఈ విషయం అనంతపేట్ గ్రామస్తులకు తెలుపడంతో వెంటనే లక్ష్మణచాంద మండల కేంద్రంలోని చౌరస్తాకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. రాత్రి 8గంటల సమయంలో దాదాపు 200 మంది అక్కడే ధర్నా చేశారు. దాంతో రెండు గంటలపాటు ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ సుమలత ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు సర్ది చెప్పారు. దాడి చేసిన వ్యక్తులను పట్టుకుని, కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో శాంతించారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా.. కేసును విచారిస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చెప్పారు.